# అంబర్‌పేటలో ముగ్గురి ఆత్మహత్య కేసు: నలుగురు అక్రమ వడ్డీ వ్యాపారుల అరెస్టు

## వడ్డీ వేధింపులే కారణమని పోలీసుల నిర్ధారణ

**విశ్వంభర, హైదరాబాదు :** అంబర్‌పేట బాపునగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నలుగురు అక్రమ వడ్డీ వ్యాపారులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాదు జోన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డిసిపి రక్షిత కె. మూర్తి వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 24న హోటల్ వ్యాపారి కడిగేకర్ రామ్‌రాజ్, భార్య మాధవి, కుమారుడు శశాంక్‌రాజ్ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. రామ్‌రాజ్ మల్లాపూర్‌లో "కింగ్స్ బిర్యానీ" హోటల్ నిర్వహిస్తున్నారు. వ్యాపార అవసరాల కోసం మహమ్మద్ వాసి ఉజ్ జమాన్ అలియాస్ ఇర్ఫాన్ (జవహర్ నగర్, మౌలాలి), పి. రాజశేఖర్ రెడ్డి (వెంకటేశ్వర నగర్, మౌలాలి), మహమ్మద్ నవాజ్ (సుధా నగర్, ఓల్డ్ సఫిల్‌గూడ), సయ్యద్ మజీద్ హైదర్ (సాదుల్లా నగర్, మౌలాలి) వద్ద నుంచి రూ.57 లక్షలు అధిక వడ్డీకి అప్పు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులు రోజువారీ వడ్డీ వసూలు చేస్తూ తీవ్ర ఒత్తిడి తెచ్చి, ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, భూమి పత్రాలు బలవంతంగా తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు సూసైడ్ నోట్‌లో రాసి ఉందన్నారు. మృతుల కూతురు అమూల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కాల్ డేటా రికార్డులు పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 12 ఖాళీ చెక్కులు, 6 ఖాళీ ప్రామిసరీ నోట్లు, ఒప్పంద పత్రాలు, యాదాద్రి భువనగిరి జిల్లా గాంధీ మాల్ గ్రామంలోని




మూడు ఎకరాల భూమి పత్రాలు, బాండ్ పేపర్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో అడిషనల్ డిసిపి జె. నర్సయ్య, ఓయు ఎసిపి జి. జగన్, అంబర్‌పేట ఇన్స్పెక్టర్ టి. కిరణ్ కుమార్, డిఐ మహ్మద్ హాఫీజుద్దీన్, ఎస్సైలు సురేష్, తరుణ్ పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీజీలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

**విశ్వంభర, చండూరు:**



విద్యార్థులకు స్వయం అనుభవం కోసమే స్వపరిపాలన దినోత్సవంను నిర్వహించినట్లు చండూరు మున్సిపాలిటీలోని గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. సోమవారం నాడు గాంధీజీ విద్యాసంస్థలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఒక్కరోజు పాలనలో విద్యార్థులు నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా తమ పాత్రలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలుగా పెద్ద కాన్వాయ్ గా చండూరు మున్సిపాలిటీ వీధుల్లో తిరుగుతూ... ప్రజలను పలకరించడంతో నిజంగా ముఖ్యమంత్రి మరియు మంత్రులు చండూరుకు వచ్చారా అన్నట్లుగా ప్రజలందరూ ఎంతో ఆసక్తితో తిలకించారు. కలెక్టర్, డీఈవో, ఎంఈఓ లుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ విద్యార్థులను ఎంతగానో ఆకర్షించింది. స్వపరిపాలన దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ స్వపరిపాలన దినోత్సవం లో సీఎంగా సాయి విగ్నేష్, డిప్యూటీ సీఎం గా కె. చందు, మంత్రిగా బి సాయిరాం, హర్షవర్ధన్, ప్రతిపక్ష నాయకులుగా కె.సాయిరాం, వై ఈశ్వర్, కె ప్రదీప్, జే. శివప్రసాద్, కలెక్టర్‌గా ఏ శిరీష, జాయింట్ కలెక్టర్‌గా ఆర్ వర్షిత, ఆర్డీఓ గా కావ్య, డీఈవోగా బి. జయశ్రీ, ఎండి జోహా, కరస్పాండెంటుగా కె. దివ్య , హెచ్ఎం గా జి. యమునా జి. భార్గవి , తమ తమ పాత్రలను పోషించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ భార్గవ్, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.600 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**




ఐటీ కారిడార్‌కు ఆనుకుని గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 600 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ సర్వే నంబరు 86/పి లో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని జలమండలికి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ స్థలంలో రకరకాల పేరిట ఆక్రమణలు చేస్తూ వస్తున్నారు. కొన్ని షెడ్డులు కూడా వేసి కబ్జా చేశారు. జలమండలి నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం ప్రభుత్వం కేటాయించినదిగా గుర్తించారు. ఆ భూమిని ఆక్రమించి కొంత మంది వేసిన షెడ్డులను తొలగించింది. మొత్తం 6.30 ఎకరాల జలమండలికి కేటాయించిన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

## స్పీకర్ వ్యవస్థకే వన్నె తెచ్చిన విలువల శిఖరం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

స్పీకర్ వ్యవస్థకే వన్నె తెచ్చిన విలువల శిఖరం శ్రీపాదరావు అని కర్ణాటక స్పీకర్ యూటీ ఖాదర్ ఫరీద్ కొనియాడారు. రాజకీయాల్లో పదవి అనేది నెత్తిన పెట్టుకునే కిరీటం కాదని.. అది బాధ్యత అని చాటిచెప్పిన దార్శనికుడన్నారు. సోమవారం హైటెక్ సిటీలోని శిల్పారామ కళా వేదికలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూటీ ఖాదర్ ఫరీద్ మాట్లాడుతూ.. సర్పంచ్ నుంచి స్పీకర్ వరకు ఎదిగిన శ్రీపాదరావు రాజకీయ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం లేకపోతే అది అధికారం అవుతుంది తప్ప సేవ కాదని బలంగా విశ్వసించారన్నారు. చివరి వరకూ ప్రజా సేవే శ్వాసగా విలువలతో కూడిన రాజకీయం చేశారన్నారు. ప్రజాప్రతినిధి సరిగ్గా పనిచేయకపోతే వెనక్కి పిలిచే రీకాల్ విధానాన్ని మనస్ఫూర్తిగా సమర్థించిన గొప్ప ప్రజాస్వామ్యవాది శ్రీపాదరావు అని అన్నారు. స్పీకర్‌గా ఉన్నప్పుడు అధికార, ప్రతిపక్షాలకు సమాన అవకాశం కల్పించి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడారన్నారు. ఒక నాయకుడు ఎలా బతకాలో మాత్రమే కాదని.. చనిపోయిన తర్వాత కూడా ప్రజల గుండెల్లో ఎలా బతికి ఉండాలో నిరూపించిన ధన్యజీ వన్నారు. రాజకీయాల్లో నైతికత, పార్లమెంటరీ విలువలు ప్రశ్నార్థకమవుతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి మహనీయులు చూపిన అనుసరణీయమన్నారు.

**రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలి..**

సభాపతిహోదాలో ఆయన నెలకొల్పినప్రమాణాలు నేటితరుణంలో ఆచరించాల్సిన అవసరం ఉన్నదన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసం ఆయన పడిన తపన.. నేటి తరం నాయకులకు ఒక పాఠ్యపుస్తకమన్నారు. శ్రీపాదరావు కేవలం చట్టసభకే పరిమితం కాలేదని, సామాజిక ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కూడా అమాయకులను రక్షించేందుకు రాజ్యాంగ పరిధిలో ఉండి ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. ఆయన చూపిన



విలువల బాటలో పయనిస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా, నిబద్ధత గల నాయకుడిగా మంత్రి శ్రీధర్‌బాబు ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తిని రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు. 'ప్రజాక్షేత్రంలో సాటి మనిషి కోసం ఎలా నిలబడాలి.. కష్టాల్లో ఉన్నవారికి ఎలా అండగా నిలవాలనే నైతిక విలువల్ని మా నాన్న మాకు వారసత్వంగా ఇచ్చారు. తనను నమ్ముకున్న ఒక సామాన్య కార్యకర్త ఇంటికి వెళ్తూ, ప్రజల మధ్యే ఆయన అమరుడయ్యారు. తన ఊపిరి ఆగిపోయే వరకూ ప్రతి అడుగు ప్రజల కోసమే వేశారు' అని శ్రీపాదరావు తనయుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని.. అదే నిబద్ధతతో ప్రజా సేవలో ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, ఆది శ్రీనివాస్, ప్రేమ్ సాగర్‌రావు, గండ్ర సత్యనారాయణ, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ బకాయిల కోసం విశ్రాంత ఉద్యోగుల నిరాహార దీక్ష

**విశ్వంభర, హైదరాబాద్:**



రిటైర్మెంట్ బకాయిల కోసం ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చే దుస్థితి తెలంగాణలో ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాదు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించబడింది. ఈ దీక్షలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు సంఘీభావం వ్యక్తంచేశారు. ఎన్. రాంచందర్ రావు, ఎంపీ ఈటల రాజేంద్ర , బిజెపి మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ ఇతర నేతలు మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవితాంతం కష్టపడి సంపాదించిన బకాయిల కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం అత్యంత దారుణమని, ఇది రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతారని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం బిజెపి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాజపా శ్రేణులు పాల్గొన్నారు.

## తప్పుల మీద తప్పులు చేస్తున్న సీఎం రేవంత్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**



రెండున్నర ఏళ్లుగా రాహుల్‌గాంధీ రాష్ట్రానికి వస్తున్నారు..వెళ్తున్నారని..రాష్ట్రఅభివృద్ధి మాత్రం ముందుకు పోవడం లేదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రకటనలో పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి ఏం సూచనలు ఇచ్చేందుకు రాహుల్‌గాంధీ వచ్చారని ప్రశ్నించారు. యూపీలో బుల్డోజర్ రాజ్యం నడుస్తున్నదని రాహుల్ పదే పదే మాట్లాడుతున్నారని.. మరి తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం గురించి రాహుల్‌కు తెలియదా అని నిలదీశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల కూడా గాజాలా మారిందని.. రాహుల్ గాంధీ ఖమ్మం వెళ్లి చూడాలని సూచించారు. పేద ప్రజలంతా ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ తప్పుల మీద తప్పులు చేస్తుంటే రాహుల్ గాంధీ ఏం చేస్తున్నారని నిలదీశారు. రాహుల్‌గాంధీ బీసీల కోసం కొట్లాడకుండా.. పోలీసులతో వెలుగుమట్ల బాధితులను కొట్టిస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజల ఇళ్లు కూల్చిన చోటే మళ్లీ కట్టించాలని డిమాండ్ చేశారు.

## 99 రోజుల యాక్షన్ ప్లాన్.. జీహెచ్ఎంసీ అధికారులకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ కీలక ఆదేశం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

జీహెచ్ఎంసీ పరిధిలో 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' ను రిజల్ట్ ఓరియెంటెడ్‌గా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక అధికారి జయేశ్ రంజన్ జీహెచ్ఎంసీ అధికారులకు కర్తవ్యబోధ చేశారు. సోమవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో జయేశ్ రంజన్ అధ్యక్షతన మొట్టమొదటి జీహెచ్ఎంసీ కార్పొరేషన్ సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో తీర్మానించిన 30 అంశాలపై చర్చించి జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. అనంతరం జయేశ్ రంజన్ మాట్లాడుతూ, మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 14 వారాల పాటు జరగనున్న ఈ కార్యక్రమం ఒక్కో వారం ఒక్కో థీమ్ తో జరుగుతుందన్నారు. పారిశుధ్యంతో మొదటి వారం ప్రారంభమై విద్య, వైద్యం, మహిళా, రైతు, యువత, పర్యావరణం తదితర థీమ్ లతో జరగనుందని తెలిపారు. మొదటి వారం పారిశుద్ధ్యం పేరుతో జరిగే కార్యక్రమంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ల పై ప్రత్యేక దృష్టి సారించి తొలగించాలన్నారు. ఇష్టారీతిన చెత్తను వేసే వారిపై జరిమానాలు విధించడం, ఈ - వేస్ట్ సేకరణ, చెరువులు, సరస్సులలో స్వయం సహాయక మహిళా సంఘం సభ్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌ల సహకారంతో గార్బేజ్ తొలగించడం, టెక్స్టైల్ వేస్ట్ ను సేకరించడం వంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రభావంతంగా చేపట్టాలన్నారు.

**అంతర్గతంగా కార్యాచరణ సిద్ధం చేయాలి..**

యూత్ వీక్‌లో యువతలో నైపుణ్యాల అభివృద్ధి పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. యాంటీ డ్రగ్ చైతన్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 99 రోజుల పాటు కార్యక్రమాలను చేపట్టేలా అంతర్గతంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం బాగా జరిగేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. రెండు రోజుల్లో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ జీహెచ్ఎంసీకి చెందిన



అస్సెట్‌లు, లయబిలిటీ మూడు కార్పొరేషన్లకు పంపిణీ చేసే ప్రక్రియను పూర్తి చేసి రిపోర్టు అందించనుందని జయేశ్ రంజన్ తెలిపారు.

**30 అంశాలకు ఆమోదం..**

జయేశ్ రంజన్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిటీ సమావేశం 30 అంశాలకు ఆమోదం తెలిపింది. ఎక్కువగా రోడ్ల నిర్మాణ పనుల కోసం భూసేకరణ అంశాలు ఉన్నాయి. పాతబస్తీలోని ఖిల్వత్ స్థలంలో మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. బతుకమ్మకుంట పార్క్‌కు 'వి. హనుమంతరావు బతుకమ్మకుంట'గా నామకరణం, సీఆర్ఎంపీ ఫేజ్-II కింద రోడ్ల అభివృద్ధికి పరిపాలనా అనుమతి. సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్లకు తలా రూ.500 కోట్లు బడ్జెట్ కేటాయింపు వంటి అంశాలను సమావేశం ఆమోదించింది. దీంతోపాటు జీహెచ్ఎంసీ, మల్కాజ్ గిరి సైబరాబాద్ కార్పొరేషన్ల ఆదాయాలు-ఖర్చులు తాత్కాలికంగా జీహెచ్ఎంసీ జనరల్ ఫండ్ ద్వారా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ. కర్ణన్, అదనపు కమిషనర్ లు సత్యనారాయణ, జోనల్ కమిషనర్‌లు కమిషనర్‌లు ప్రియాంక అలా, మందా మకరందు, జి ముకుంద రెడ్డి, కే ఏ.మంగతాయారు, ఎస్.శ్రీనివాసరెడ్డి, చంద్రకళ, విజిలెన్స్ ఏఎస్పీ నరసింహ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, ఎస్ఈ జ్యోతిర్మయి, సీసీపీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా గౌరవ్ ఉప్పల్

**విశ్వంభర, హైదరాబాద్:**



తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌరవ్ ఉప్పల్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాగౌరవ్ ఉప్పల్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రితో చర్చించినట్లు తెలిసింది. వైద్య రంగ అభివృద్ధికి సమన్వ యంతో పనిచేయాలని మంత్రి సూచిం చినట్లు సమాచారం.

## బాల్క సుమన్‌కు బెయిల్ మంజూరు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**



: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బెయిల్ మంజూరు అయింది. క్యాతన్‌పల్లి ఘటనలో అరెస్టై జైలులో ఉన్న ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల జిల్లా కోర్టులో సోమవారం వాదనలు జరిగాయి. సుదీర్ఘ వాదనల అనంతరం కోర్టు బెయిల్ ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా ఎక్స్ అఫీషియో ఓటు హక్కు వినియోగించుకునేందుకువస్తున్న మంత్రి వివేక్, ఎంపీ వంశీ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నాయకులతో పాటు బాల్క సుమన్‌దాడికి పాల్పడ్డారు. ఈఘటనలో మంత్రి కారుఅద్దాలు ధ్వంసం అయ్యాయి. ఎస్ఐ గంగారాం, కానిస్టేబుల్ నరేశ్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుతో బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనం తరం మంచిర్యాల కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి 14రోజుల జ్యుడిషియల్‌రిమాండ్ విధించారు. అనంతరం సుమన్‌ను ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

## తెలంగాణలో బతికే నీకు ఆ హక్కు లేదు.. గరికపాటికి కమలానంద భారతి కౌంటర్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

కేరళ పేరును కేరళంగా మారుస్తూ మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్? రాజకీయాల్లో హాట్ టాపిక్?గా మారింది. కేరళ పేరును మార్చినట్లుగానే ఆంధ్రప్రదేశ్ పేరును మార్చాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ పేరు మార్చాలని అలా చేస్తేనే ప్రజల బతకులు మారుతాయంటూ ప్రముఖ ప్రవచనకర్త, అవధాని గరికపాటి నరసింహారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే అంధ్రప్రదేశ్ అని పేరు ఉంటే నష్టమేంటి అంటూ గరికపాటి వ్యాఖ్యలపై భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం కేరళ పేరు మార్పు పక్కన పెడితే ఏపీలో ఈ వ్యవహారం కొత్త రచ్చకు దారితీసేలా కనిపిస్తోంది.

**గరికపాటి ఏమన్నారు?:**

ఆంధ్రప్రదేశ్ అమలాపురంలో ఇటీవల జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో గరికపాటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పేరు మార్పు అంశాన్ని ప్రస్తావించారు. కేరళ స్థానంలో కేరళంగా మార్చినట్లు ఆంధ్రప్రదేశ్ స్థానంలో ఆంధ్ర నాడు అని మార్చాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అనేది తెలుగు మాట కాదని, కేరళ ప్రజలకున్న రాష్ట్రాభిమానం, భాషాభిమానం మనకు లేదన్నారు. ఈ విషయం చెప్పడానికి తనకు ఎలాంటి మోహమాటం లేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చేందుకు నాడు ఎన్టీఆర్‌నానా యాతన పడ్డారు. ఆయన ఆశయానికి అనుగుణంగా తెలుగు నాడు అని మార్చిన నాడు మనకు కచ్చితంగా జాతీయాభిమానం ఉంటుంది. ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ ఎలాగో ఆంధ్రప్రదేశ్ అనే పేరు అంతే. ఇందులో తెలుగుదనమే లేదన్నారు. తమిళనాడు మాదిరిగా తెలుగునాడు అని రాష్ట్రం పేరు మార్చుకుంటే తెలుగు ప్రజల బతుకులు కూడా మారతాయని హాట్ కామెంట్స్ చేశారు.

**ఎక్కడో బతికేవాళ్ల సలహాలు మాకొద్దు..**

గరికపాటి వ్యాఖ్యలపై తాజాగా స్పందించిన కమలానంద భారతి ఆంధ్రప్రదేశ్ అని పేరు ఉంటే నష్టమేంటని ప్రశ్నించారు. రామాయణం కాలం నాటి నుంచి ఆంధ్ర అనే పేరు మనుగడలో ఉందని ఆ మూలాలు



వదిలేయవద్దన్నారు. తెలంగాణలో సెటిల్ అయిన గరికపాటికి ఏపీ గురించి ఏం అవసరం? బయట రాష్ట్రాల వాళ్లు ఏపీ ప్రజలకు సలహాలు ఇవ్వొద్దన్నారు. ఆంధ్ర మహాభాగవతం, ఆంధ్ర మహాభారతం ఉన్నాయని ఇప్పుడు తెలివి, అధిక ప్రసంగం ఎక్కువైపోయి వాటిని ఇప్పుడు తెలుగు భాగవతం, తెలుగు భారతం అని రాసుకుంటున్నారు. అడిగేవాడు లేకపోవడంతో ఇలా జరుగుతోంది. చరిత్రను మన మూలాలను పక్కన పెట్టి ఆంధ్ర అంటేనే ఉచ్చరించకూడదని పదంగా మార్చేశారని మండిపడ్డారు. ఈ రకమైన ఆలోచనలు గరికపాటికి ఎందుకొస్తున్నాయని ప్రశ్నించారు. అప్పుడప్పుడు సంక్రాంతి, వేసవి సెలవులకు ఏపీకి వచ్చే మీకు 5 కోట్ల మంది ఆంధ్ర ప్రజలు ఎలా ఉండాలో చెప్పే నైతిక బాధ్యత మీకు లేదన్నారు. ఆంధ్రాభిమానంతో బతుకుతున్న మా అభీష్టం, మా నమ్మకాలు మా సెంటిమెంట్?తో పని లేకుండా ఏడాదికోసారి ఇటువైపు వచ్చి ఇది ఆంధ్రకాదు తెలుగు నాడు అంటే నమ్మే అమాయకులం మేము కాదన్నారు. ఈ రాష్ట్రం, మా బతుకులు ఎలా ఉండాలో చెప్పొద్దన్నారు. మమ్మల్ని ఈడ్చి అవతల విసిరేశాక మా బతుకు మేము బతుకుతున్నాం. ఇక్కడ మేము బతకలేము అని ఎక్కడో బతికేవాళ్లు ఇక్కడికొచ్చి సలహాలు ఇవ్వొద్దన్నారు. ఇలాంటి వాదనలతో విచ్ఛిన్నం తేవొద్దని మేము ఆంధ్రులం ఆంధ్రప్రదేశ్ గానే ఉంటామన్నారు.

## నగరంలో కామదహనం

**విశ్వంభర, హైదరాబాద్:**



హోలీ పండుగ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో కామదహనం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెడుపై మంచితనం గెలుపును సూచించే ఈ ఆచారంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ సంబరాలను ప్రారంభించారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు: ఎస్సై సాయిరాం

**విశ్వంభర,సూర్యాపేట:** మైనర్లు వాహనాలు నడపడం ప్రాణాలకే ప్రమాదకరమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రాణాలను ప్రమాదంలో పడేయ వద్దని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఈరోజు సా యంత్రం 60 ఫీట్ల రోడ్డులో సాయంత్రం నిర్వహించిన మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్‌లో ఆయన మాట్లాడారు. పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించారు. ఇకపై ప్రతి రోజు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, లైసెన్స్ లేని మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానాతో పాటు తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు. పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.




రంగారెడ్డి జిల్లా బెస్ట్ సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ ఆవిర్భావ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సీనియర్ సిటిజెన్ నాయకుడు కనక రత్నం పాల్గొన్న దృశ్యం.